సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం । 6 । ఏప్రిల్ । 2023



రాజన్న సేవలో ప్రముఖులు

వేములవాడ:రాజన్నను మహారాష్ట్రలోని రాయిగడ్ అలీబాబా జిల్లా పాన్వెల్ డివిజన్ సీనియర్ సివిల్ జడ్జి గున్నాల్ అనిల్ రామకృష్ణ, ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ మంజుశర్మ దర్శించుకున్నారు.



మూలవాగు అంతా మురికే..

వేములవాడలోని మూలవాగు మురికికూపంతో కొట్టుమిట్టాడుతోంది. డ్రెయినేజీ నీళ్లతో నిండిపోతోంది. గుడి చెరువుది కూడా అదే పరిస్థితి. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.0/23.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటిపూట ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.

రంజాన్ వేళలు

ఇతరులతో నిన్ను నువ్వు పోల్చుకోవటం ఆపినప్పుడు నీవు నీ అసలైన జీవితపు ఆనందాన్ని పొందుతావు.

– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
గురు 6.36	శుక్ర 4.40

న్యూస్‌రీల్

ప్రజాగ్రహానికి గురికాక తప్పదు



మాట్లాడుతున్న మృత్యుంజయం

గంభీరావుపేట(సిరిసిల్ల): అప్రజాస్వామిక విధానాలు అవలంభిస్తున్న ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కటకం మృత్యుంజయం అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అరెస్టు నేపథ్యంలో గంభీరావుపేట మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒక ప్రజాప్రతినిధికి ఎలాంటి నోటీస్‌లు లేకుండా అర్ధరాత్రి పోలీస్ బలగాలతో అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. బీజేపీ కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీసేందుకు ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని అన్నారు.ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి, కృష్ణకాంత్ యాదవ్, ఎలందర్, మహేష్‌యాదవ్, మురళిగౌడ్, దుర్గేష్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

సీపీఐ, సీపీఎంలతో ఉమ్మడి ఉద్యమాలు

బోయినపల్లి(చొప్పదండి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో బలమైన ఉమ్మడి ఉద్యమాలు చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీస్తుందని ఆరోపించారు. ఈనెల 9వ తేదీన హైదరాబాద్‌లోని సర్కస్ గ్రౌండ్‌లో చేపట్టే ఉమ్మడి బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడు మీసం లక్ష్మణ్, పిల్లి మల్లేశం, లింగాల వెంకటి, కత్తెరపాక రాజయ్య, ఆనంద్, శంకర్, రాజయ్య, మల్లయ్య, రాజలింగం, దుర్గయ్య, తదితరులు ఉన్నారు.

వసతిగృహాలకు పక్కా భవనాలు నిర్మించాలి

సిరిసిల్లఅర్బన్: సంక్షేమ వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లాలోని బీసీ బాలుర వసతి గృహంలో మాట్లాడుతూ.. హాస్టళ్లకు పక్కా భవనాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నా రు. కనీస మౌలిక వసతులు లేవని, మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డివిజన్ ఇన్‌చార్జి ఇల్లందుల ప్రకాశ్, నాయకులు తరుణ్, రాహుల్, పవన్, విజయ్, వినాయక్, కార్తీక్, మణికంఠ, తదితరులు ఉన్నారు.

ఎస్సెస్సీ.. టీఎస్‌పీఎస్సీ.. లీకు మూలాలు ఇక్కడే!

- ఉమ్మడి జిల్లాకు పేపర్ల లీకుల లింకులు
- పదో తరగతి పేపర్ కేసులో ఏ–1గా సంజయ్
- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటలకూ చేరిన పోస్టు
- ఆ ఘటనలోనే బండిపై సుమోటో కేసు, ప్రివెంటివ్ అరెస్టు
- అరెస్టు సమయంలో మరోసారి కరీంనగర్‌లో హైడ్రామా
- మల్యాలలో టీఎస్‌పీఎస్సీ లీకేజీపై సిట్ విచారణ



బండిని కలవడానికి వచ్చిన కుటుంబ సభ్యులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ అరెస్టు అనంతరం రాష్ట్ర రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా వేడెక్కాయి. మంగళవారం పదో తరగతి హిందీ పరీక్ష పత్రం సోషల్ మీడియాలో ప్రత్యక్షం కావడంతో పోలీసులు అత్యంత గోప్యంగా, పకడ్బందీగా వ్యవహరించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మంగళవారం రెండు పరిణామాలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ఉదయం ఎస్సెస్సీ పేపర్ బూర ప్రశాంత్ అనే యువకుడి కారణంగా కమలాపూర్ నుంచి బయటికి రావడంతో పరిణామాలు అకస్మాత్తుగా మారిపోయి, రాత్రి వరకు బండి సంజయ్ అరెస్టుకు దారి తీసింది. మరోవైపు ఇటీవల టీఎస్ పీఎస్సీ లీకేజీలో ఏ–2 నిందితుడిగా ఉన్న అట్ల రాజశేఖర్‌రెడ్డి జగిత్యాల జిల్లా మల్యాలకు చెందిన అతను కావడంతో సిట్ దర్యాప్తులో భాగంగా దర్యాప్తు ముమ్మరం చేసింది. దీంతో రాష్ట్రాన్ని తీవ్రంగా కుదిపేసిన రెండు అంశాలకు మూలం ఉమ్మడి కరీంనగర్ జిల్లానే కావడం చర్చనీయాంశంగా మారింది.

సంజయ్, ఈటలకు లింకులు..?

మంగళవారం ఉదయం ఎస్సెస్సీ పేపర్ సోషల్ మీడియాలో బయటికి రావడం కలకలం రేపింది. ఈ విషయంలో పోలీసులు పేపర్ ఎక్కడి నుంచి వచ్చింది? అన్న విషయాన్ని గుర్తించినా.. దానికి బండి సంజయ్‌కు ఉన్న లింకులను బుధవారం వెల్లడించింది. పేపర్‌ను బూర ప్రశాంత్ తొలుత ఎంపీ బండి సంజయ్‌కు పంపడం, పలుమార్లు ఫోన్లు మాట్లాడటంతో అతడినే ఈ కేసులో కుట్రదారుడిగా.. ఏ–1గా వరంగల్ పోలీసులు చేర్చారు. అదే సమయంలో సదరు ఎస్సెస్సీ హిందీ పేపర్ హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఫోన్‌కు కూడా చేరిందని పోలీసులు తెలిపారు. కానీ.. ఈ ఆరోపణలను రాజేందర్ మీడియాకు స్పష్టమైన వివరణ ఇవ్వలేకపోయారు. ఇదే కమలాపూర్ పోలీసులు బండి సంజయ్ మీద నమోదు చేసిన కేసు ఆధారంగా కరీంనగర్ పోలీసులు మంగళవారం అర్ధరాత్రి అరెస్టుకు పూనుకున్నారు. బుధవారం మధ్యాహ్నానికి బండి సంజయ్‌పై టూటౌన్‌లో సుమోటో కేసు నమోదు చేసి, ముందస్తు అరెస్టుకు దారి తీసిన పరిస్థితులను ఎఫ్ఐఆర్‌లో వివరించారు.

మల్యాలలో సిట్.. దూకుడు..!

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 పేపర్ లీకేజీలో ఏ–2గా ఉన్న రాజశేఖర్‌రెడ్డిది జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపెల్లి. 2017 వరకు విదేశాల్లో ఉన్న రాజశేఖర్ రెడ్డి తరువాత ఏడాది తనకున్న పరిచయాలతో టీఎస్‌పీఎస్సీలో కొలువు సాధించాడు. అనంతరం పలు పేపర్లను పరీక్షకు ముందే విక్రయించాడన్న కేసులో అరెస్టయ్యాడు. ఇతను కూడా ఉమ్మడి జిల్లా వాసే కావడం గమనార్హం. మండలంలో మొత్తం 40 మంది గ్రూప్–1 పరీక్ష రాసిన వారి వివరాల ఆధారంగా సిట్ నేరుగా మంగళవారం నుంచి రంగంలోకి దిగింది. మొత్తం 40 మందిలో దాదాపు 35 మందికి పైగా 100 లోపు మార్కులు రాగా, కేవలం ఐదుగురికి మాత్రం 100 మార్కులు దాటాయని సమాచారం. వీరందరినీ సిట్ బృందం రెండురోజులుగా నేరుగా వారి ఇంటికే వెళ్లి విచారిస్తోంది.

జైలు వద్ద కోలాహలం

కరీంనగర్‌క్రైం: ఎస్సెస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో బీజేపీ స్టేట్ చీఫ్ సంజయ్‌కు హన్మకొండ మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించగా.. బుధవారం రాత్రి కరీంనగర్ జైలుకు తరలించారు. రాత్రి 10 గంటలకు సంజయ్‌ను జైలుకు తీసుకురాగా, ఆయనను కలిసేందుకు కుటుంబసభ్యులు, అభిమానులు ప్రయత్నించారు. పోలీసులు పెద్ద సంఖ్యలో చేరుకొని జైలు బయటి గేటు దాటకుండా నిలువరించారు.రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ కార్యకర్తలు నినాదాలు చేశారు.

హుజూరాబాద్‌లో కార్యకర్తల అరెస్ట్

సంజయ్‌ని వరంగల్ నుంచి కరీంనగర్ వైపు కాన్వాయ్‌లో తీసుకొస్తున్న క్రమంలో హుజూరాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. మానకొండూరులో బీజేపీ నాయకులు భాషబోయిన ప్రదీప్ యాదవ్, కోండ్ర సురేశ్, ఎం.రమేశ్, నందగిరి బలరాం కాన్వాయిని అడ్డుకునే ప్రయత్నం చేశారు.

కరీంనగర్ టు కరీంనగర్

మంగళవారం రాత్రి హైడ్రామా మధ్య సంజయ్‌ను కరీంనగర్‌లో అరెస్ట్ చేసి వివిధ పోలీసు స్టేషన్‌లు తిప్పారు. బుధవారం సాయంత్రం హన్మకొండ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరుచగా, రిమాండ్ మేరకు బుధవారం రాత్రి తిరిగి కరీంనగర్ జైలుకు తరలించారు. 24 గంటలు గడవక ముందే కరీంనగర్‌లోనే అరెస్ట్ చేసి కరీంనగర్ జైలులోనే రిమాండ్ చేశారు.

మరోసారి కరీంనగర్‌లో ఉద్రిక్తత..!

- ఎస్సెస్సీ హిందీ పేపర్ సోషల్‌మీడియాలో ప్రత్యక్షం కావడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. సాయంత్రానికి కుట్రలో ఎవరెవరు పాలు పంచుకున్నారన్న విషయంపై పోలీసుశాఖ పలు ఆధారాలు సంపాదించింది. అందులో భాగంగానే మంగళవారం అర్ధరాత్రి బండి సంజయ్‌ను జ్యోతినగర్‌లోని అతని స్వగృహం నుంచి బలవంతంగా అరెస్టు చేసి బొమ్మల రామారం పోలీసుస్టేషన్‌కు తరలించారు.
- గతేడాది జనవరి 2వ తేదీన 317 జీవో అమలుకు వ్యతిరేకంగా జరిగిన దీక్షను పోలీసులు భగ్నం చేశారు. ఆ క్రమంలో పోలీసులు బీజేపీ కార్యాలయం తలుపులు బద్దలు కొట్టి అరెస్టు చేసిన విషయం సంచలనం రేపింది. తరువాత ఈ విషయంలో పోలీసుల తీరుపై పార్లమెంటు ప్రివిలేజ్ కమిటీకి బండి ఫిర్యాదు చేసే వరకు వెళ్లింది.
- ఆ తరువాత నవంబరు 27న భైంసా సభకు అనుమతి లేదంటూ జగిత్యాల సమీపంలో అరెస్టు చేసిన పోలీసులు అదే రోజు రాత్రి ఆయన్ని కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లోని ఆయన నివాసంలో దింపి వెళ్లిపోయారు.
- తాజాగా బండి సంజయ్‌ను అరెస్టు చేస్తున్న క్రమంలోనూ బుధవారం తెల్లవారుజామున తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బండిని అరెస్టు చేయకుండా అనుచరులు తీవ్రంగా ప్రతిఘటించడంతో భారీ తోపులాట జరిగింది. మొత్తానికి బండి సంజయ్‌ను అరెస్టు చేయాల్సి వచ్చిన ప్రతీసారి కరీంనగర్‌లో అర్ధరాత్రి హైడ్రామా నెలకొంటోంది.

ముంపు గ్రామాల త్యాగం వెలకట్టలేనిది

బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్



మాట్లాడుతున్న వినోద్ కుమార్

వేములవాడఅర్బన్: ఇదీ ఎన్నికల సంవత్సరం. ఎమ్మెల్యే, ఎంపీ, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరుగుతాయి. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పనిచేయాలి. ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించుకుంటూ ముందుకు సాగాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. వేములవాడ అర్బన్ మండల బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం అగ్రహారంలో బుధవారం జరిగింది. వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. 2009లో మొదటిసారి గెలిచిన 6 నెలలకు తెలంగాణ కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి న మొదటి వ్యక్తి ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు అన్నారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాట్లాడుతూ.. ముంపు గ్రామాల ప్రజల త్యాగం వెలకట్టలేనిదన్నా రు. జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు ఆత్మగౌరవం కల్పించిన వ్యక్తి సీఎం కేసీఆర్ అన్నారు. ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ నీతి, నిజాయితీగా, నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయాలని చెప్పిన మహనీయుడు చెన్నమనేని రాజేశ్వరరావు అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే ఎనలేని అభివృద్ధి జరిగిందని అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ ప్రతీఒక్కరు పార్టీ కోసం పనిచేయాలన్నారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, పవర్‌లూమ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, ఎంపీపీ బూర వజ్రమ్మ, జెడ్పీటీసీ మ్యాకల రవి, మండల అధ్యక్షుడు ఉరడి ప్రవీణ్, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో అప్రెంటీస్‌షిప్ మేళా

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం మండెపల్లి పరిధిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 10న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5వరకు జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.కనకయ్య తెలిపారు. 2022 సంవత్సరం నాటికి ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మెకానిక్ డీజిల్, మెకానిక్ మోటార్ వెహికల్, వెల్డర్ ట్రేడ్‌లలో ఉత్తీర్ణులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తిగల అభ్యర్థులు ఎస్‌ఎస్‌సీ మెమో, ఐటీఐ మెమో, ఆధార్ కార్డు జిరాక్స్, కుల ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు సెల్‌నంబర్లు 9505674905, 8106794500 సంప్రదించాలని సూచించారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమా?



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: వరుసగా ప్రశ్నాపత్రం లీకేజీతో విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం ఎదురుగట్ల గ్రామంలో మాట్లాడుతూ గ్రూపు–1, ఇంటర్, ఎస్‌ఎస్‌సీ వరుసగా మూడు పరీక్ష పత్రాలు లీకేజీ వెనుక ఎవరిహస్తం ఉందో వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీతో కొంత మంది విద్యార్థులు మనోవేదన చెంది ఆత్మహత్య చేసుకుంటున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం చెక్కపల్లిలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. పార్టీ వేములవాడరూరల్ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, సర్పంచ్ సోయినేని కరుణాకర్, బొడ్డు రాములు, బండ శ్రీనివాస్, ఎరవెల్లి అనిల్, గంగరాజు, ప్రభాకర్, కొమిరెడ్డి లక్ష్మణ్, అంబేద్కర్ యువజన సంఘాల అధ్యక్షుడు ప్రశాంత్, తదితరులున్నారు.

సమ సమాజ స్థాపనే జగ్జీవన్ ధ్యేయం



జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న నేతలు, అధికారులు

- బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో వక్తలు

సిరిసిల్లకల్చరల్: సమ సమాజ స్థాపనే ధ్యేయంగా సమతావాది, మాజీ ఉప ప్రధాని జీవిత పర్యంతం కృషి చేసిన బాబూ జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. జగ్జీవన్ రామ్ 116వ జయంతిని బుధవారం జిల్లాకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన వేదికపై జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎస్పీ, అదనపు కలెక్టర్, ఆర్డీవో, మున్సిపల్ చైర్‌పర్సన్ తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. వివక్ష లేని సమాజం ఆవిర్భవించేందుకు, సమాజాన్ని సంస్కరించేందుకు తపించిన మహనీయుడిగా కీర్తించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ స్వాతంత్ర సమర యోధుడిగా ఉప ప్రధానిగా దేశానికి జగ్జీవన్ అందించిన సేవలు అసామాన్యమైనవని అన్నారు.అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ఉప ప్రధానిగా పలు కీలక మంత్రిత్వ శాఖలను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. రాష్ట్ర పవర్‌లూమ్, చేనేత డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, డీఆర్వో, శ్రీనివాసరావు, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, కమిషనర్ సమ్మయ్య, జిల్లా సంక్షేమ అధికారి పి.లక్ష్మీరాజం, బీసీ,ఎస్సీ అభివృద్ధి అధికారులు మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, తదితరులున్నారు.





శ్రీఆంజనేయం

- కాషాయమయమైన కొండగట్టు
- దీక్ష, మాల విరమణ చేసిన భక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధి కాషాయమయమైంది. లక్షలాదిగా తరలివచ్చిన మాలధారులు, సాధారణ భక్తులతో పుణ్యక్షేత్రం రద్దీగా మారింది. 'జై శ్రీరామ్.. జై హనుమాన్' అంటూ భక్తుల నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. బుధవారం ఉదయం ఐదు గంటల నుంచే మనరాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్య ప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరావడం ప్రారంభమైంది. వీరంతా బుధవారం అర్ధరాత్రి 12గంటల తర్వాత క్యూలైన్ల ద్వారా శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత కల్యాణ కట్టకు చేరుకుని మాల విరమణ, దీక్ష విరమణ చేశారు. గురువారం హనుమాన్ చిన్నజయంతి నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. పోలీసుల డేగకళ్లతో పహారా కాస్తున్నారు.



దర్శనం కోసం క్యూలో స్వాములు




ఇరుముడి సమర్పిస్తున్న స్వాములు



కోనేరులో పుణ్యస్నానం చేస్తూ..



కొండపైకి కాలినడకన వస్తున్న స్వాములు



తలనీలాలు సమర్పిస్తూ..





ఇరుముడులతో స్వామివారిని దర్శించుకుంటున్న అంజన్న దీక్షాపరులు

క్లుప్తంగా

రాచరికపు పాలన సాగిస్తుండ్రు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ
- పోలీసుల హౌస్ అరెస్టు


బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణను హౌస్ అరెస్టుచేసిన పోలీసులు

వేములవాడ: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాచరికపు పాలన సాగిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక పోలీసులు ఆయన్ని హౌస్ అరెస్టుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని, పోలీసులచే పార్టీ నాయకులను అణచివేస్తున్నారన్నా రు. తమతోపాటు మరి కొంత మంది బీజేపీ నాయకులను స్థానిక పోలీసులు ఠాణాలో బంధించారన్నారు.

ఎంపీ పదవికి రాజీనామా చేయాలి


మాట్లాడుతున్న సబ్బని హరీశ్

సిరిసిల్లఅర్బన్: బండి సంజయ్ ఎంపీ పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సబ్బని హరీశ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకే టీఎస్పీఎస్సీ, టెన్త్ ప్రశ్నపత్రాల లీకేజీతో బండి సంజయ్ నేతృత్వంలో కుట్ర చేశారని ప్రశ్నపత్రాలు లీక్‌చేసిన వారు ఎంపీ సన్నిహితులని పేర్కొన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీలో దొరికిపోయిన బండి సంజయ్ ఎంపీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్కే. బాబా, సాయిదీపక్, సతీశ్, అశ్వక్, రాజేశ్, యూసుఫ్ తదితరులు ఉన్నారు.

కరాటే విద్యార్థులకు డీఎస్పీ అభినందన


అభినందిస్తున్న డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడ: జిల్లాస్థాయి కిక్‌బాక్సింగ్‌లో ప్రతిభ కనబర్చిన కరాటే విద్యార్థులను డీఎస్పీ నాగేంద్రచారి బుధవారం అభినందించారు. ఈనెల 1న సిరిసిల్ల జిల్లాకేంద్రంలోని వెంకంపేట రోడ్డులోని సాయికృష్ణ ఫంక్షన్‌హాలులో నిర్వహించిన జిల్లాస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల్లో వేములవాడకు చెందిన ఆద్రిత, ప్రసన్య, సుదీప్త, నక్షత్ర, సంజన, నీవేదా, శరత్‌చంద్ర, శ్రీహర్ష, వికాస్, విశ్వతేజ, రాజేశ్, లత, లాస్య హిరణ్, మన్విత, ఆర్ణవ్, విఘ్నేష్ పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ గగ్గూరి దివ్య తెలిపారు. కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, బింగి మహేశ్ పాల్గొన్నారు. చదువుతో పాటు కరాటే ఎంతో ఉపయోగపడుతుందని డీఎస్పీ విద్యార్థులకు వివరించారు.

డైనమిక్ లీడర్.. రామ్‌లు

- జిల్లా రాజకీయాల్లో విలక్షణమైన వ్యక్తిత్వం
- అనారోగ్యంతో కన్నుమూసిన 'కొమొరెడ్డి'
- శోకసంద్రంలో అభిమానులు
- పలువురు నాయకుల సంతాపం
- మెట్‌పల్లిలో రేపు అంత్యక్రియలు


రామ్‌లు(ఫైల్)

కోరుట్ల/మెట్‌పల్లి: రాజకీయాల్లో ఆయనది అలుపెరగని పోరాటం.. నమ్మిన సిద్ధాంతం కోసం రాజీపడని మనస్తత్వం.. మాస్, డైనమిక్ లీడర్‌గా ప్రజల్లో గుర్తింపు పొందిన మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు(82).. జిల్లా రాజకీయాల్లో విలక్షణమైన వ్యక్తిగా పేరు సంపాదించారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. బుధవారం హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్న ఆయన.. రెండేళ్ల క్రితం కరోనా బారిన పడ్డారు. ఆ తర్వాత కోలుకున్నా.. అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. అప్పటినుంచి తరచూ ఆస్పత్రుల్లో వైద్యచికిత్సలు తీసుకుంటున్నారు. కొద్దిరోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న గుండెపోటుకు గురై తనువు చాలించారు. ఆయన మరణంతో నియోజకవర్గంలో విషాద ఛాయలు అలముకున్నాయి. అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. పార్థివదేహాన్ని మెట్‌పల్లిలోని ఆయన స్వగృహానికి తీసుకొచ్చారు. శుక్రవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య జ్యోతిదేవి, ముగ్గురు కుమారులు ఉన్నారు.

సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభం..

- మెట్‌పల్లి మండలం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన రామ్‌లు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి న్యాయవిద్య పట్టా పొందారు.
- ఓవైపు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూనే మరోవైపు రాజకీయాల్లో చురుకుగా వ్యవహరించారు.
- 1968లో వెంకట్రావ్‌పేట సర్పంచ్‌గా ఎన్నికయ్యారు.


మెట్‌పల్లి నగరబాటలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డితో కొమొరెడ్డి రామ్‌లు(సర్కిల్‌లో)

- 1978లో తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు.
- 1983లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచి రెండోస్థానంలో నిలిచారు.
- 1985 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి చెన్నమనేని విద్యాసాగర్‌రావు చేతిలో కేవలం 372 ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి చెందారు.
- 1989, 94, 99 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి పరాజయం పాలయ్యారు.
- 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ టిక్కెట్ లభించకపోవడంతో జనతా పార్టీ నుంచి బరిలో నిలిచారు.
- ఆ ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుపై విజయం సాధించి తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు.
- ఆసమయంలో ఫ్లోర్‌లీడర్‌గా వ్యవహరించారు.
- 2009లో పోటీకి దూరంగా ఉన్న ఆయన.. 2014లో మరోసారి కాంగ్రెస్ నుంచి పోటీచేసి ఓడిపోయారు.
- 2018లో పోటీకి దూరంగా ఉన్నారు.
- మొత్తానికి ఎన్నికల్లో అనేకమార్లు పరాజయం చవిచూసినా.. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ కొమొరెడ్డి రామ్‌లు ఆదర్శంగా నిలిచారు.

పేరులో మార్పుతోనే ఎమ్మెల్యేగా విజయం..

కొమిరెడ్డి రాములుగా ఎన్నికల్లో పోటీచేసిన ప్రతీసారి ఆయన పరాజయమే చవి చూశారు. 2004 ఎన్నికలకు ముందు ఆధ్యాత్మికవేత్తల సూచనల మేరకు తన పేరులో మార్పు చేసుకున్నారు. కొమిరెడ్డిగా ఉన్న ఇంటి పేరును కొమొరెడ్డిగా, రాములు పేరును రామ్‌లుగా మార్చుకున్నారు. ఇలా మార్చుకొని ఆ తర్వాత ఎన్నికల్లో పోటీచేసిన ఆయన విజయం సాధించారు. అది కలిసి రావడంతో అప్పటి నుంచి ×కొమొరెడ్డి రామ్‌లు⁊గానే కొనసాగుతూ వస్తున్నారు.

సతీమణి జ్యోతికి రాజకీయంగా ప్రోత్సాహం

- కుటుంబంలో రాజకీయంగా తన సతీమణి జ్యోతిదేవిని కూడా రామ్‌లు ఎంతో ప్రోత్సహించారు.
- న్యాయ విద్య అభ్యసించిన జ్యోతిని 1998లో మెట్‌పల్లికి జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో నిలిపారు.
- ఆ ఎన్నికల్లో ఆమె విజయం సాధించారు.

- అంతకుముందు జ్యోతి మెట్‌పల్లి ఎంపీపీగా వ్యవహరించారు.
- రామ్‌లు – జ్యోతి దంపతులకు ముగ్గురు కుమారులు.
- తమలాగే వీరిని న్యాయవాదులుగా తీర్చిదిద్దారు.
- పెద్ద కుమారుడు కరంచంద్‌ను తమ రాజకీయ వారసునిగా వచ్చే ఎన్నికల్లో పోటీలో నిలపాలని నిర్ణయించారు.

ప్రత్యర్థులకు హడల్

రాజకీయాల్లో విమర్శలు సహజం. ఒక పార్టీవారిని మరోపార్టీ వారు విమర్శించడం సాధారణం. కానీ, కోరుట్ల నియోజకవర్గంలో ఇందుకు భిన్నమైన పరిస్థితి ఉండడం గమనార్హం. రామ్‌లును విమర్శించడానికి ప్రత్యర్థి పార్టీల నాయకులు ఎవరు కూడా సాహసించకపోవడం ఆయన విలక్షణమైన వ్యక్తిత్వానికి నిదర్శనమనే అభిప్రాయం ఉంది.

రాజీపడని మనస్తత్వంతో నష్టాలు..

నమ్మిన సిద్ధాంతం కోసం ఆయన ఏనాడూ రాజీపడలేదు. దీంతో రాజకీయంగా చాలా నష్టపోయారనే అభిప్రాయం ఉంది. బీసీ నాయకుడిగా ఆదినుంచీ దొరల పాలనను వ్యతిరేకించే వారు. ఈ నేపథ్యంలో రాజకీయంగా అనేక ఆటుపోట్లు ఎదురైనా వెనుకంజ వేయలేదు. ఇదే ఆయనకు ప్రజల్లో ప్రత్యేకమైన గుర్తింపు తీసుకొచ్చింది.

పలువురి సంతాపం

రామ్‌లు మృతికి మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతోపాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు సంతాపం వ్యక్తం చేశారు.

భూమి పేరుతో రూ.10 లక్షలకు టోకరా..

- ఇద్దరిపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): భూమి కొనుగోలుచేసి ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి మోసంచేసి రూ.10 లక్షలులకు టోకరా వేసిన ఇద్దరిపై బుధవారం పోలీసులు కేసు నమోదుచేశారు. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన శ్రీరామోజీ సుధాకర్ అనే వ్యక్తికి ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లో వ్యవసాయభూమి అమ్ముతామని చెప్పి అతని వద్దనుంచి ఎల్లారెడ్డిపేటకు చెందిన దేశ్‌పాండే అంజనేయులు, ఒగ్గుబాల్‌రాజు అనే ఇద్దరు రూ.35 లక్షలు తీసుకున్నారు. కొంత కాలం గడిచిన తర్వాత భూమి అమ్మకుండాభూమి వివాదంలో ఉందని చెప్పి సుధాకర్‌కు డబ్బులు తిరిగి ఇస్తామని నమ్మబలికారు. సుధాకర్ ఒత్తిడి తేవడంతో రూ.25 లక్షలు ఇచ్చారు. మిగతా 10 లక్షలు అవసరాలకు వాడుకోని ఇవ్వకుండా మోసం చేయడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. అంజనేయులు, బాల్‌రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఇసుక వాహనం పట్టివేత..


పోలీసులు పట్టుకున్న వాహనం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్ శివారు మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు బుధవారం పట్టుకున్నారు.ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్నపేటకు చెందిన శివరాత్రి నర్సింహులు పికప్ వాహనంలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో వాహన తనిఖీలు చేప ట్టామన్నారు. ఈక్రమంలో పికప్ వాహనాన్ని తని ఖీ చేయగా ఎలాంటి పత్రాలు లేవన్నారు. దీంతో వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉద్రిక్తంగా మారిన దిష్టిబొమ్మ దహనం

- ముస్తాబాద్‌లో కాంగ్రెస్ వర్సెస్ పోలీస్
- సీఎం దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్న పోలీసులు


ముస్తాబాద్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీకి నిరసనగా కాంగ్రెస్ నాయకులు ముస్తాబాద్‌లో చేపట్టిన సీఎం దిష్టిబొమ్మ దహనం ఘటన ఉద్రిక్తంగా మారింది. ముస్తాబాద్ రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు బుధవారం ఆందోళన చేపట్టారు. ధర్నా అనంతరం సీఎం దిష్టిబొమ్మకు నిప్పంటించారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న ఎస్సై వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్నారు. ఈక్రమంలో పోలీసులు, కాంగ్రెస్ నాయకులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో పలువురు స్వల్పంగా గాయపడ్డారు. దీంతో పోలీసులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రశ్నించే గొంతును అణగదొక్కుతున్నారని, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును పోలీసులు కాలరాస్తున్నారన్నారు. విధులకు ఆటంకం కలిగించడంతో పాటు, దాడికి యత్నించినవారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలి పారు. సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్ ముస్తాబాద్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఎస్సై వెంకటేశ్వర్లు ఫిర్యాదుతో దాడికి యత్నించిన కాంగ్రెస్ నాయకులపై కేసులు నమోదు చేశామన్నారు. ఘటనకు బాధ్యులైన వారందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముస్తాబాద్ రాజీవ్‌చౌక్‌లో ఒక్కసారిగా పోలీస్ వర్సెస్ కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణతో పలువురు ఆందోళనకు గురయ్యారు.

దాడికి పాల్పడిన ముగ్గురి అరెస్టు

- రిమాండ్‌కు తరలింపు

చందుర్తి(వేములవాడ): కర్రలు, ఇనుప రాడ్లతో దాడిచేసిన కేసులో చందుర్తి మండలం దేవునితండాకు చెందిన ముగ్గురిని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు చందుర్తి ఎస్సై జిల్లెల్ల రమేశ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.... 28 రోజుల క్రితం దేవునితండాకు చెందిన ఆజ్మీరా రవి, గుగులోతు శేఖర్ కలిసి అటవీశాఖకు చెందిన భూమిని బ్లేడ్ ట్రాక్టర్లతో చదునుచేస్తుండగా గుగులోతు శేఖర్‌కు చెందిన బ్లేడు ట్రాక్టర్‌ను అటవీశాఖ అధికారులు సీజ్‌చేసి చందుర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేశారు. ఈక్రమంలో ఆజ్మీర రవి తన ట్రాక్టర్‌తో పారిపోయాడు. అప్పటి నుంచి ఆజ్మీరా రవి, గుగులోతు శేఖర్ మధ్య విబేధాలు తలెత్తాయి. ఇద్దరం కలిసి పనిచేసే చోట తమ ట్రాక్టర్ చిక్కిందని, కేసులకు అయ్యే ఖర్చులను రవీందర్ భరించాలని గతనెల 22న శేఖర్ గొడవకు దిగాడు. ఆవేశానికి గురైనా ఆజ్మీర రవి, రాజేందర్, జలెందర్ కలిసి గుగులోతు రమేశ్, భూక్య లక్ష్మణ్, భూక్య సంతోష్‌లపై కర్రలు, ఇనుప రాడ్లతో దాడికి దిగారు. దాడిచేసిన ఆజ్మీర రవి, రాజేందర్, జలెందర్ బుధవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి ఎస్సై రమేశ్ వివరించారు.

డెయిరీలో నిధుల దుర్వినియోగం?

- రహస్యంగా విచారణ జరిపిన అధికారులు
- అధ్యక్షుడు, కార్యదర్శిల తొలగింపు

కోనరావుపేట: మండలంలోని ధర్మారం కరీంనగర్ డెయిరీలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పాల ఉత్పత్తిదారులు, డైరెక్టర్లు విచారణ చేయగా సుమారు రూ.30వేలు దుర్వినియోగమైనట్లు తేలింది. కేంద్రంలో పనిచేస్తున్న ఓవ్యక్తి పాల ఉత్పత్తిదారులకు పంపిణీ చేయాల్సిన డబ్బుల్లో ముగ్గురిపేరిట రిజిష్టర్‌లో ఎక్కువగా రాసి పెట్టినట్లు గుర్తించారు. వచ్చిన మొత్తం కంటే రిజిష్టర్‌లో ఎక్కువగా రాసి ఉండడంతో అది గుర్తించని చైర్మన్.. పంపిణీ చేసిన డబ్బులు తక్కువైనప్పటికీ సొంతంగా రైతులకు చెల్లిస్తూ వస్తున్నాడు. ఈ తతంగం విచారణలో తేలడంతో చైర్మన్, కార్యదర్శిని తొలగించారు. లెక్కల్లో తేలిన డబ్బులు తిరిగి చెల్లించేందుకు సదరు వ్యక్తులు ఒప్పుకున్నట్లు సమాచారం.

గుండెపోటుతో వ్యవసాయ కూలి మృతి

ఓడెల(పెద్దపల్లి): మండలంలోని మడక గ్రామానికి చెందిన మ్యాకల సదయ్య(40) అనే వ్యవసాయ కూలి గుండెపోటుతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. సదయ్య రోజూ మాదిరిగానే బుధవారం కూలి పనులు ముగించుకొని గ్రామంలోని బస్టాండ్ సమీపంలో కూర్చున్నాడు. ఆసమయంలో అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కిందపడిపోయాడు. గ్రామస్తులు గమనించి, 108కు సమాచారం అందించారు. అతనికి సీపీఆర్ చేస్తుండగా అంబులెన్స్ వచ్చింది. సిబ్బంది పరీక్షించి, సదయ్య మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడికి భార్య వజ్ర, నలుగురు కూతుళ్లు ఉన్నారు. బాధితకుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

వీర్నపల్లి: మండలంలోని కంచర్ల గ్రామంలో ఎస్సై నవత ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట సీఐ మొగిలి హాజరై మాట్లాడారు. సైబర్ నేరాలపై ప్రతీఒక్కరికి అవగాహన ఉండాలని గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి వివరాలు అడిగితే స్పందించవద్దన్నారు. ఒకవేళ స్పందిస్తే మోసం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రజలు తమ బ్యాంక్ వివరాలు అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దని సూచించారు. ఓటీపీలు, మెస్సేజ్‌లకు స్పందించవద్దన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930 నెంబర్‌కు వెంటనే కాల్ చేయాలన్నారు. సర్పంచ్ పిట్టల రజిత, పోలీస్‌సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పుస్తెల తాడు చోరీ

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జవహర్‌నగర్‌కు చెందిన కొటం లక్ష్మి అనే వృద్ధురాలి మెడలోని మూడు తులాల పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తులు లాక్కెళ్లారు. బుధవారం తెల్లవారుజామున ఇంట్లోకి చొరబడిన దొంగలు తనపై దాడి చేసి, పుస్తెల తాడు ఎత్తుకెళ్లారని బాధితురాలు తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ రెండో సీఐ ప్రసాదరావు తెలిపారు.

మూలవాగంతా మురికే


మురికినీటితో కనిపిస్తున్న మూలవాగు


చెత్త, ప్లాస్టిక్ కవర్లతో దుర్గంధంగా మారిన మూలవాగు


మూలవాగులోకి చేరుకుంటున్న డ్రైనేజీ నీరు

- గుడి చెరువూ అదే దుస్థితి
- డ్రైన్ వాటర్‌తో బేంబేలు
- పట్టించుకోని పాలకులు
- అవస్థలు పడుతున్న జనం

వేములవాడ: ప్రజలకు స్వచ్ఛమైన నీరందించేందుకు ప్రకృతి ప్రసాదించిన మూలవాగు, పట్టణవాసులకు నీటి ఎద్దడి నివారించి భూగర్భజలాలు వృద్ధిచేసి, పాడి–పంటలు బాగుండాలని నిర్మించిన రాజన్న గుడి చెరువు మురుగునీటితో నిండి కలుషితమవుతున్నాయి. ఏండ్లుగా ఇలా జరుగుతున్నా.. పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. దీంతో స్వచ్ఛమైన నీరు కళ్లముందే కలుషితమవుతూ తిరిగి మళ్లీ మనకే వస్తున్నాయంటూ జనం బేంబేలెత్తిపోతున్నారు. అధికారులు, పాలకులు ఇది చూస్తున్నా మురుగునీటిని దూరప్రాంతాలకు తరలించే పనిమాత్రం చేయడం లేదన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

అటూ...ఇటూ మురుగే- మురుగు

వేములవాడ పట్టణవాసులకు మురుగునీరు వెంటాడుతోంది. గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఎదిగినప్పటికీ ఇంకా మురుగునీటిని బయటి ప్రాంతాలకు తరలించే ప్రక్రియనే ఆరంభం కాలేదు. ఫలితంగా మురుగంతా రాజన్న గుడి చెరువు, మూలవాగులో నిలిచిపోతున్నాయి. దీంతో కాలుష్యం కళ్లముందే కనిపిస్తుండడంతో జనం భయపడిపోతున్నారు. భూగర్భజలాలు సైతం కలుషితమవుతున్నట్లు శివారు కాలనీవాసులు మొత్తుకుంటున్నారు. ఇటీవల దోమలు పెరిగి అనారోగ్యంబారిన పడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. పాలకులు కేవలం ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి సమర్పించడం తప్ప మరో అడుగు ముందుకు వేసిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. ఫలితంగా పట్టణవాసులకు దుర్గంధంలో దుర్భర జీవనం సాగించాల్సి వస్తోంది.

గుడిచెరువు... మూలవాగు కలుషితం

వేములవాడ పట్టణం నుంచి వెలువడే మురుగునీరంతా సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక ఓవైపు రాజన్న గుడి చెరువు, మరోవైపు స్వచ్ఛమైన మూలవాగులోకి మురుగునీరంతా చేరుతోంది. ఇలా ఏండ్లు గడుస్తున్నా వీటి వంక చూసిన నాథుడే లేకుండాపోయాడు. కోరుట్ల బస్టాండ్ ప్రాంతం నుంచి చెక్కపల్లిరోడ్డు, భగవంతరావునగర్, శివసాయినగర్, పోలీస్‌స్టేషన్ ఏరియా మురికినీరంతా గుడి చెరువులోకి, సాయినగర్, విద్యానగర్, సుభాష్‌నగర్, మార్కెట్ ఏరియా, బద్దిపోచమ్మవీధి, జాతార గ్రౌండ్, గాంధీనగర్, ఉప్పుగడ్డ, ముదిరాజ్‌వీధి, అంబేడ్కర్‌నగర్, మహాలక్ష్మీవీధి ప్రాంతాల మురుగునీరంతా మూలవాగులో వచ్చి చేరుతోంది.

వేములవాడ ప్రొఫైల్

- 45వేలకు పైగా జనాభా
- 10వేలకు పైగా గృహాలు
- 65 కిలో మీటర్ల వరకు ఇప్పటి వరకున్న ఓపెన్ డ్రెయినేజీ
- 40 కిలోమీటర్ల వరకు మట్టిడ్రైన్
- మురుగునీరంతా మూలవాగు, గుడి చెరువులోకే వెళ్లడం
- రూ. 33 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీకి ప్రతిపాదనలు సిద్ధం
- సంకెపల్లి గంజివాగు వద్ద ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి ప్రతిపాదనలు

పదేళ్లుగా మొత్తుకుంటున్నం



మాది ఉప్పుగడ్డ వీధి. మూలవాగుకు ఒడ్డునే ఉంటాం. మూలవాగులో చేరుకున్న మురుగుతో దుర్వాసన పెరిగిపోతోంది. దీంతో వాసన భరించలేకపోతున్నాం. గతంలో ఎన్నోసార్లు పాలకుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా ఫలితం లేదు. పట్టణం నుంచి వెలువడే మురుగునీటిని ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా పట్టణ శివారులోకి పంపిస్తే తప్పా ఈ సమస్యకు పరిష్కారం దొరకదు. పాలకులు ఆ దిశగా అడుగులు వేయాలని కోరుతున్నాం.

– సగ్గు పద్మ, ఉప్పుగడ్డవీధి,వేములవాడ

మురికి కూపంగా మారింది



వేములవాడ మూలవాగు అంటే మంచినీరు అందించే ముఖ్యమైన ఆధారం. అలాంటి మూలవాగులోకి డ్రెయినేజీ నీటిని పంపిస్తూ మురికి కూపంగా మార్చుతున్నారు. గతంలో మూలవాగు చెలిమలోంచి నీళ్లు తెచ్చుకుని తాగేవాళ్లమని మా పెద్దలు ఇప్పటికీ చెబుతుంటారు. అలాంటి మూలవాగును పూర్తిగా నాశనం చేస్తున్నారు. డ్రెయినేజీ నీరు మూలవాగులోకి రాకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది.

– సుదర్శన్ యాదవ్, ఉప్పుగడ్డవీధి, వేములవాడ

ప్రతిపాదనలు పంపాం



ప్రస్తుతం మూలవాగు బండ్ పనులు కొనసాగుతున్నాయి. ఇటీవల కలెక్టర్ మూలవాగులోకి మురుగునీరు చేరకుండా ఉండేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేసి ఇవ్వాలని ఆదేశించారు. రూ.33 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి గతంలో సమర్పించాం. నిధులు మంజూరు కాగానే మురుగునీరు గుడిచెరువు, మూలవాగులోకి వెళ్లకుండా నేరుగా గంజీవాగు వద్దకు పంపించి ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి బయటికి పంపించే ప్రక్రియ చేపడతాం. దీంతో కాలుష్యం కంట్రోల్ అవుతుంది.

– అన్వేష్, మున్సిపల్ కమిషనర్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

రామడుగు(చొప్పదండి): మండలంలోని దత్తోజీపల్లికి చెందిన తొట్ల మహేందర్(36) విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. మహేందర్ గ్రామంలో నూతనంగా ఇల్లు నిర్మించుకుంటున్నాడు. బుధవారం ఉదయం గోడలకు నీళ్లు పట్టేందుకు మోటారు ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి, నీటి సంపులో పడిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారని స్థానికులు పేర్కొన్నారు. మహేందర్ భార్య పావని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఒక్క ఎస్ఎంఎస్‌తో రూ.1.50 లక్షలు మాయం

జ్యోతినగర్(రామగుండం): మొబైల్‌కు వచ్చిన ఎస్ఎంఎస్ లింక్‌తో ఓ వ్యక్తి ఖాతాలో నుంచి రూ.1.50 లక్షలు మాయమైన సంఘటనపై ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై జీవన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌నకు చెందిన విష్ణుదేవరావు మొబైల్‌కు పాన్‌కార్డు అప్‌డేట్ చేసుకోవాలని ఎస్ఎంఎస్ వచ్చింది. దీంతో ఆయన సదరు లింక్ ఓపెన్ చేసి, వివరాలు అప్‌లోడ్ చేయడంతో బ్యాంకు ఖాతాలోని రూ.1.50 లక్షలు డెబిట్ అయినట్లు మెస్సేజ్ వచ్చింది. తాను మోసపోయాయని తెలుసుకున్న బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని ఇందిరమ్మ కాలనీలో గురువారం వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం.ఇందిరమ్మకాలనీకిచెందిన జక్కని నారాయణ(70) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గురువారం ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి కొడుకు జక్కని రమేశ్, కూతురు భాగ్యలక్ష్మి ఉన్నారు. తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.